# వ్యాపారాయణం

అమెరికా అవకాశాల దేశం.

మనిషి స్వతహాగా అవకాశవాది.

అవకాశం రాగానే, దాన్ని ఆశావాదంతో తమకి అవసరమైనట్టు, అనువైనట్టు వాడుకోవటం తెలివిగలవారి లక్షణం.

అలా ఆ అవకాశాల్ని వాడుకున్నారు కనుకనే, మనం ఈ రోజు ఒక బిల్ గేట్స్‌నీ, స్టీవ్ జాబ్స్‌నీ, మైకెల్ డెల్‌నీ, ప్రేంజీనీ, నారాయణమూర్తినీ, రామలింగ రాజునీ చూస్తున్నాం.

అందరూ అంత పైకి వెళ్ళనఖ్ఖర్లేదు. వారి వారి కలలను, ఏ పరిధిలోనైనా సరే, పండించుకోవటం అవసరం. ఎవరి దగ్గరా ఉద్యోగం చేయకుండా, తమ కాళ్ళ మీద తాము నిలబడటమే కాకుండా, కొందరికో ఎందరికో ఉద్యోగావకాశాలు కలిపించటమే సగటు అమెరికన్ కనే కల. ఈ అమెరికన్ పెట్టుబడిదారి వ్యవస్థలో అది మరీ సులభం కాకపోయినా సాధ్యమే.

మన దేశం కాని ఈ దేశంలో, మనవాళ్ళు వ్యాపారాల వ్యాపకంలో ఎలా విజయవంత మవుతున్నారో పారాయణం చేసుకోవటమే ఈ వ్యాపారాయణం.

0 0 0

నేను ఈ మధ్య ఇక్కడ ప్రచురించిన కొన్ని గణాంకాలు చూసి, అవి మీతో పంచుకుంటే బాగుంటుందనిపించి ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

ముందుగా అమెరికాలో రెండు లక్షల ముఫై ఒక్క వేల వ్యాపారాలని భారతీయ సంతతకి చెందినవారు నడుపుతున్నారుట. ఒక్క 2002 సంవత్సరంలోనే వీరు 89 బిలియన్ల డాలర్ల విలువైన వ్యాపారం చేశారు. ఆరు లక్షల, పదిహేను వేల మందికి ఉద్యోగాలు ఇప్పించారు. ఇది సామాన్యమైన విషయమేమీ కాదు.

అంతకుముందు ఐదేళ్ళల్లో ఈ వ్యాపార ఆదాయం 39 శాతం పెరిగింది. ఇక్కడ విశేషం ఏమిటంటే, అమెరికా మొత్తం మీద అదే సమయంలో సరాసరి పది శాతం మత్రమే పెరిగింది. అంటే మనం పదండి ముందుకి, పదండి తోసుకు,

పోదాం పోదాం పైపైకి అని అంటూ, తోసుకుంటూ అమెరికా దేశ వ్యాపార ప్రగతికి దాదాపు నాలుగు రెట్ల వేగంతో వెడుతున్నామన్నమాట!

అమెరికాలోని ఆసియా దేశ సంతతి వ్యాపారాల్లో, చైనా ఒకటో స్థానంలో వుంటే మనం రెండో స్థానంలో వున్నాం!

0 0 0

అవునండీ, మీరు చెప్పింది బ్రహ్మాండంగా వుంది. కానీ ఏమిషి వీళ్ళు చేస్తున్న వ్యాపారాలూ, దాని కమమిషూ అనేది పెద్ద ప్రశ్న.

నలభై ఒక్క వేల చిల్లర కొట్టు చిట్టెమ్మలు, చిట్టెయ్యలూ ఏటా 230 లక్షల డాలర్ల వ్యాపారం చేస్తూ, ఆదాయంలో ముందున్నారు. ఇంతకీ ఈ చిట్టి పొట్టి గట్టి వాళ్ళెవరంటే, పప్పులూ ఉప్పులూ అమ్మే షాపులనించీ - అందాన్నిచ్చే షాపులూ (సెలూన్లు, బట్టలూ), ఆనందాన్నిచ్చే షాపులూ (విడియోలూ, సీడీలు), ఆకలి తీర్చే రెస్టారెంట్లూ, ఆశ పెట్టే నగల షాపులూ.... ఇలా చాల వున్నాయి. కొన్ని ఇండియన్స్ కోసమే అయితే కొన్ని అందరి అవసరార్థమూనూ. రెండవ స్థానంలో వున్నవి వృత్తి సంబంధమైన ప్రొఫెషనల్ సర్వీసులు. అలాటి 39,000 వ్యాపారాలు 122 లక్షల డాలర్ల ఆదాయం చూపిస్తున్నాయి. ఇవి కన్సల్టింగ్ సర్వీసులూ, సైకాలజీ, న్యాయవాద వృత్తులూ మొదలైనవి. మూడవ స్థానంలో ఆరోగ్య సంబంధమైనవి. దాదాపు 34 వేల బిజినెస్‌లు 111 లక్షల డాలర్ల వ్యాపారం చేస్తున్నాయి.

నాలుగవ స్థానంలో వున్నవి మోటేళ్ళు, హోటేళ్ళు. మనం ఇండియాలో హోటల్ అనేది ఇక్కడ రెస్టారెంట్ అంటారు. ఇక్కడ హోటేల్ అంటే ఇండియాలో లాడ్జింగ్ అన్నమాట. మొటేల్ అంటే మన గదికి దగ్గరగా కారు పార్క్ చేసుకునే అవకాశం వున్న హోటేల్ అని. మొటేళ్ళు హోటేళ్ళ కన్నా కొంచెం చౌక. అయినా అవీ బాగానే వుంటాయి. ఇక్కడ నేను చెప్పదలుచుకున్న దేమిటంటే, అమెరికాలో ఎన్నో వేల మొటేళ్ళు మన వాళ్ళవే. గుజరాతీ పటేల్ మొటేల్స్.

పటేల్, మొటేల్ అనే రెండు మాటలూ ఒకదానికొకటి ఫెవికాల్లా అతుక్కుపోయాయి. దాదాపు ఇరవై ఐదు వేల మొటేళ్ళు ఏటేటా 99 లక్షల డాలర్లు సంపాదిస్తున్నాయిట. దానికి కారణం ఒక పటేల్, చుట్టమయినా కాకపోయినా, ఇంకో పటేల్‌కి పైకి రావటానికి చేయూతనిస్తాడు.

ఇంతకుముందు అంటే అనగా అనగా మన తెలుగువాళ్ళలో కూడా, ఒకే ఒక వృత్తిలోని వ్యక్తి ఇంకో తెలుగువాడిని పైకి రమ్మని ఆహ్వానించేవాడుట. అదెవరో తెలుసా గుర్రపు బండి నడిపే అతను. మరీ వెనకగా కూర్చుంటే గుర్రం మెడ ఒరుసుకుంటుందని పైకి రండి సార్ అనేవాడు. ఇప్పుడు గుర్రం బళ్ళు పోయాక ఒక తెలుగువాడిని పైకి రమ్మనే తెలుగు వాళ్ళే కరువయారు. లేకపోతే పాటేళ్ళలా కొట్టకోకుండా, పటేళ్ళలా ఒకళ్ళకొకళ్ళం సహాయం చేసుకునేవాళ్ళం కదా.

హతవిధీ!

మనవాళ్ళు ఇంకా రకరకాల వ్యాపారాల్లో నిలదొక్కుకున్నారు.

మరి వీళ్ళందరూ ఏఏ రాష్ట్రాల్లో, ఊళ్ళల్లో ఈ వ్యాపారాలు చేస్తున్నారు?

కాలిఫోర్నియా రాష్ట్రం 43,254 బిజినెస్‌లతో, 17 బిలియన్ డాలర్ల సంపాదనతో మొదటి స్థానంలో వుంది. తర్వాత న్యూయార్క్ రాష్ట్రం (43,240 కంపెనీలు, 11 బిలియన్ డాలర్లు); న్యూజెర్సీ (19,131 కంపెనీలు, 7 బిలియన్ డాలర్లు). మా టెక్సస్ 18,497 భారతీయ బిజినెస్‌లతో, 8 బిలియన్ల సంపాదనతో నాలుగవ స్థానంలో వుంది. తరువాత వరుసగా ఇల్లినాయ్, ఫ్లోరిడా, జార్జియా, వర్జీనియా, మేరీలాండ్, పెన్సిల్వేనియా, మిషిగన్ రాష్ట్రాలు వున్నాయి.

ఈ ఈ రాష్ట్రాల్లో, ఏ వూళ్ళు, ఏ ప్రాంతాలు ముందున్నాయో చూద్దాం.

న్యూయార్క్-న్యూజెర్సీ ప్రాంతం పదహారున్నర బిలియన్ల ఆదాయంతో మొదటి స్థానంలో వుంది. తర్వాత లాస్ ఏంజలెస్ ప్రాంతం, శాన్ హొసే ప్రాంతం, చికాగో, వాషింగ్టన్, హ్యూస్టన్, డాలస్... ఇలా ఇలా ఎన్నో వున్నాయి. ఇందుగలరందు లేరని, ఎందెందు వెతికినా మనవాళ్ళూ, వాళ్ళ వ్యాపారాలూ లేని చోటంటూ లేవు.

ఇక్కడ విచిత్రమేమిటంటే దాదాపు ప్రతి రంగంలోనూ వున్నారు భారతీయులు. బిలియన్ డాలర్ల హైటెక్ కంపెనీల దగ్గరనించీ, రోడ్డు పక్కన వుండే పెట్రోలు బంకు దాకా ఎక్కడ అవకాశం దొరికితే అది తీసుకోగలిగారు. అమెరికా కలిగించిన అవకాశాన్ని వెంటనే అందుకుని విజయం సాధించగలిగారు.

అలా అని వ్యాపారాలు మొదలు పెట్టిన భారతీయులందరూ ఒక్కసారిగా విజయం సాధించి, ధనవంతులయి పోరని మనందరికీ తెలుసు. దాని వెనుక ఎంతో కృషి, శ్రమా, తెలివితేటలూ, త్యాగాలూ చాల వున్నాయి. వుంటాయి. ఉన్నా కూడా ఈ దేశంలో ఏం చేయాలకున్నా, చేసినా పోటీ విపరీతంగా వుంటుంది. దాంట్లో తట్టుకుని నిలబడటం కూడా మాటలు కాదు.

0 0 0